## కథ

### "గోదిమే ఖేల్‌తీ హై... ఇస్ కి హజారోం నదియా.."

**ఇక్బాల్ విరచిత 'సారే..జహాసే..అచ్ఛా' గీతంలోని చరణాలవి.**

# క్యాపిటల్ గెయిన్స్

ఆ పాటంటే చెవి కోసుకునే కుటుంబరావు ఆరోజున 'సారే..జహాసే అచ్ఛా' అయిన 'మేరా భారత్ మహాన్'ని కసితీరా తిట్టుకుంటున్నాడు. ఇంకెవర్నీ ఏమీ అనలేక, ఎవరినంటే ఎవరూరు కొంటారు కనుక, నోరు లేని భారత మాత తప్ప. అసలు సంగతేమిటంటే...

★ ★ ★

దేశాన్ని భరత్ (మనోజ్‌కుమార్) లెవెల్లో ప్రేమించే కుటుంబరావుకి పాతికేళ్ళ క్రితం పెళ్ళి య్యింది. సంవత్సరంలోగా ఆడపిల్ల. పాపకి భారతదేశంలో గొప్పనది అయిన 'గంగ'పేరు పెట్టు కొన్నాడు. తరువాత ఆడపిల్లని 'యమున' అని పిలిచాడు. తరువాత కూడా ఆడపిల్లే.. 'ఓహ్! నా ఇల్లు త్రివేణి సంగమం' అని మురిసిపోతూ 'సరస్వతీ' అన్నాడు.

కానీ అంతరాంతల్లోంచి ఏదో భయం పుట్టుకొచ్చింది. ఎందుకంటే అతని తండ్రికి ఆరుగురు ఆడపిల్లల తరువాత 'వంశోద్ధారకుడు'గా కుటుంబరావు పుట్టాడు. ఆ ఆరుగురి పెళ్ళిళ్ళకు తండ్రి హరించుకుపోవటం గుర్తుకొచ్చింది. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకుందామనుకున్నాడు. కానీ ఇంట్లో ముసలాళ్ళకు తోడుగా శ్రీమతి కూడా 'అయ్యో! మగ నలుసు లేకపోతే ఎలా' అని వాపోవడంతో ఊరుకున్నాడు. మళ్ళీ కడుపు. ఈసారి మగపిల్లవాడు పుడితే మరో నది పేరుతో 'కృష్ణారావు' అందామనుకున్నాడు. కానీ 'కృష్ణవేణి' పుట్టింది.

★ ★ ★

కాలచక్రం గిర్రున తిరిగింది.

పెద్దకూతురు గంగ సాధారణ యువతి. చదువు మీద పెద్ద ఇంట్రెస్ట్ చూపించలేదు. బాగా చదివించాలని కుటుంబరావుకీ లేదు. బి.ఏ. చదువుతూ ఉండగానే పెళ్ళి చేసేసాడు. తండ్రి ఇచ్చిన రెండు ఎకరాలలోను ఒక ఎకరం అమ్మేసి... ఆ గంగ ఇప్పుడు రెండో కాన్పుకి వచ్చింది.

రెండోది యమున. బి.ఏ. చదివింది. ఎప్పుడూ నవలలు చదువుతూ టీవీ సీరియల్స్ చూస్తూ ఉంటుంది. మంచి సంబంధం కుదిరితే పెళ్ళి చేసేద్దామని మిగిలిన ఎకరానికి బేరం పెట్టాడు. అలా నవలలు చదువుతూ కూర్చోకుండా ఏదైనా కాన్వెంట్‌లో పనిచేసి నాలుగు రాళ్ళు సంపాదిస్తే తన చీరల ఖర్చుకైనా పనికొస్తాయి కదా అనుకొనే కుటుంబరావు 'నువ్వు సంపాదించు' అని కూతురితో చెప్పలేకపోయాడు.

మూడోది సరస్వతి. అక్కలకన్నా తెలివైనది. ఎమ్‌సెట్ కోచింగ్ తీసుకొని, మంచి ర్యాంక్ తెచ్చుకుని మంచి డ్యాక్టర్‌నవ్వాలనుకునేది. కానీ అంత స్తోమత లేని కుటుంబరావు ఆమెను బి.ఎస్సీలో చేర్చాడు. ప్రస్తుతం ఫైనల్ ఇయర్‌లో ఉంది.

నాలుగోది కృష్ణవేణి అందరికంటే తెలివయినది. కంప్యూటర్ ఇంజనీర్ కావాలని ఆశ. కోచింగ్ లేకుండానే గవర్నమెంట్ కాలేజీలో ఇంటర్ చదివి ఎమ్‌సెట్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకొంది. గవర్నమెంట్ సీటు సంపాదించుకుంది. అయితే ఉన్న ఊళ్ళో కాదు వేరే చోట. గవర్నమెంట్ సీటు అయినా వేరే చోట హాస్టల్లో ఉంచి చదివించే స్తోమత లేక ఆమెను కూడా బి.ఎస్సీలోనే చేరమంటాడు కుటుంబరావు. కృష్ణవేణికి తండ్రి దగ్గర చనువెక్కువ. మంకుతనం, దుడుకుతనం కూడా ఎక్కువే. మాటకారి కూడా. ఇంజనీరింగ్ కాలేజీలోనే చేరతానని తండ్రితో వాదనకి దిగింది.

ఎంతో నచ్చచెప్పాడు కుటుంబరావు. అతని మైండ్‌లో ఇంకా చెయ్యాల్సిన మూడు పెళ్ళిళ్ళు మెదలుతున్నాయి. ఆపై నాలుగైదు కాన్పులు. మనవలు పుట్టిన అతని ఆరుగురు అక్కలు ఇంకా ఆడపడుచు లాంఛనాలు పుచ్చుకుంటూ దెప్పుతూనే ఉన్నారు. ఈ సాంప్రదాయాలు, కట్టుబాట్లు, కుటుంబ వ్యవస్థమీద కుటుంబరావుకి బాగా కోపం వచ్చేది. 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లు హాయిగా ఉండే పాశ్చాత్య దేశాలలో పుట్టి ఉంటే అగచాట్లు తప్పేవి కదా అనుకొనేవాడు. అంతలోనే 'జననీ జన్మభూమిశ్చ' వంటివి గుర్తు వచ్చి లెంపలేసుకుని ఆ దేశాలన్నీ మన కుటుంబ వ్యవస్థను ఇష్టపడటం గుర్తుకి వచ్చి సంతోషపడేవాడు. యమున పెళ్ళివరకు ఫరవాలేదు. సరస్వతి పెళ్ళికి మిగిలిన ప్రావిడెంట్ ఫండ్..వగైరాలన్నింటిని సమకూర్చుకోవాలి. కృష్ణవేణి పెళ్ళికి జీరోతో మొదలుపెట్టాలి. ఇంజనీరింగ్ అంటే..ఎంత గవర్నమెంట్ సీటు దొరికినా మాటలు కాదు. పైగా వేరో చోట. ఎలాగో అలా కష్టపడి ఇంజనీరింగ్ చెప్పిస్తే ఇంజనీరునో డ్యాక్టరునో అల్లుడిగా తెచ్చుకోవాలి. ఇంజనీరింగ్ చదివించటం ఒక యత్నం అయితే దానికి తగ్గ సంబంధం తేవడం మరో యజ్ఞం. బి.యస్సీ తరువాత బి.యిడి చేయిస్తే కనీసం ఏ కాన్వెంట్‌లో అయినా టీచర్‌గా చేర్పించొచ్చని అతని ఉద్దేశం. కానీ కృష్ణవేణి ఒప్పుకోవటం లేదు.

''నేను మంచి ర్యాంక్ తెచ్చుకొని గవర్నమెంట్ సీటు తెచ్చుకున్నాను నాన్నా! నా ఫ్రెండ్స్ డొనేషన్స్ కట్టి జాయిన్ అవుతున్నారు''

కుటుంబరావు వినలేదు. గవర్నమెంట్ సీటే అయినా వేరేచోట హాస్టల్లో, అందునా ఆడపిల్లని ఉంచి చదివించటం ఇష్టం లేదు. అదే చెప్పాడు.

''పోనీ కంప్యూటర్స్ కాకపోతే, ఇక్కడ కాలేజిలో ఏది వస్తే దాంట్లో చేరతాను నాన్నా''

కృష్ణవేణికెలాయినా ఇంజనీర్‌ని అనిపించుకోవాలని ఉంది. కంప్యూటర్ కాకపోతే మరొకటి.

దానికీ ఒప్పుకోలేదు. అతని దృష్టి అంతా అతను ఇంకా చెయ్యవలసిన మూడు పెళ్ళిళ్ళ మీదే ఉంది. అయితే పెద్ద కూతురు గంగలా చదువు మధ్యలో మాన్పించటం ఇష్టంలేదు. అప్పుడలా అయిపోయింది. ఏదో డిగ్రీ విత్ బియిడి ట్రెయినింగ్ ఇప్పిస్తే మినిమమ్ గ్యారంటీ ఉంటుందని అతని ఉద్దేశం. బి.యస్సీ కంప్యూటర్స్ లాంటివి తీసుకోమంటే కృష్ణవేణి మొండికేస్తోంది.

వారం రోజులుగా పై విధంగా వాదనలు ప్రతివాదనలు జరుగుతున్నాయి. ఆ రోజు సాయంత్రం వాదన తారాస్థాయినందుకొంది.

''నేనే కొడుకునయితే ఇంజనీరింగ్ చదివించేవాడివి కాదా! కూతురుననేగా చదివించటం లేదు. నేనేం పెళ్ళి చేసుకొని వెళ్ళిపోనులే నాన్నా. కట్నం లేకుండా ఎవరయినా పెళ్ళి చేసుకొంటానన్నా నేను చేసుకోను. నీ దగ్గరే ఉంటా. కొడుకు కన్నా ఎక్కువగా మిమ్మల్ని చూసుకొంటా''

కృష్ణవేణి మాటలు మనసుని తూట్లు పొడిచాయి. హతాశుడైన కుటుంబరావు సాయంత్రం అయిదు గంటల సమయంలో ఇంట్లోంచి బయటకు వచ్చేశాడు కోపంతో ఇంట్లో ఏమీ చెప్పకుండా.

★ ★ ★

రాత్రి పది దాటింది. సాయంత్రం నుంచి పిచ్చివాడిలా తిరుగుతున్నాడు. అటు ఇటు తిరిగి పార్కులో కూర్చున్నాడు. పది దాటింది గేటు మూసెయ్యాలని వాచ్‌మెన్ చెబితే మళ్ళీ రోడ్డున పడ్డాడు. జన సంచారం తగ్గుతోంది. కోపంతో బయటకు వచ్చిన మాట నిజమే కానీ కోపం ఎప్పుడో పోయింది. అసమర్ధుని కోపం ఎంతసేపు ఉంటుంది? ఎవరి మీద ఉంటుంది? తన మీదే తప్పితే. కృష్ణవేణి మాటలలో చేదునిజం దాగి ఉంది. ఆమె మాటలు అక్షరాలా నిజం. అదే కృష్ణారావు అయ్యుంటే తల తాకట్టు పెట్టయినా చదివించే వాడు. కొడుకయితే ఏదో ఉద్ధరిస్తాడని ఆశపడేటంత అమాయకుడు కాదు కుటుంబరావు. అయినా ఏదో ధైర్యం. కొడుకయితే చదువు మినహా మిగతా వాటి గురించి అంతగా ఆలోచించనవసరం లేదు. ప్లానింగ్ కూడా అనవసరం. ముఖ్యంగా పెళ్ళి విషయంలో కట్నం రాకపోయినా ఇచ్చే ప్రసక్తి ఉండదు. ఆడపిల్ల మాదిరిగా పెళ్ళి చేసి పంపాలన్న బాధ్యత ఉండదు. అయినప్పుడే అవుతుంది. అన్నీ కలిసొస్తే కట్నం తీసుకోవచ్చు. అప్పటివరకు ఆరుగురి బావగార్లకు, ముగ్గురి అల్లుళ్ళకి అడుగులకు మడుగులు ఒత్తిన తను ఒక్కసారైనా మర్యాదలు అందుకోవచ్చు. అలా ఏ విషయంలోనైనా బెంగ తక్కువగా ఉండేది అబ్బాయి అయ్యుంటే. సాయంత్రం అయిదింటికి వచ్చే అమ్మాయి ఆరయినా రాకపోతే కంగారుపుడుతుంది. అటువంటిది వేరే చోట ఎంత హాస్టలయినా బెంగ తప్పదు. ఇలా ఎన్నో అవస్థలు పడి చదివించినా ఆడపిల్ల ఆడపిల్లే.. అలా ఎంతో కష్టపడి పెట్టిన ఖర్చు కొడుకు మీదయితే..అదృష్టం బాగుంటే తన శేషజీవితం వాడి దగ్గర హాయిగా జరిగిపోతుంది. వాడికి రెక్కలొచ్చి తమని నిర్లక్ష్యం చేసినా ఆ పెట్టుబడి అంతతోనే ఆఖరు. పెళ్ళి, పురుళ్ళు వగైరా గొడవలు ఉండవు.

కుటుంబరావు ఆలోచనలలో 'అసహజం' ఏమీ లేదు.

★ ★ ★

సాయంత్రం అయిదు గంటల సమయంలో కోపంతో బయటకు వెళ్ళిన కుటుంబరావు రాత్రి పది గంటలు దాటినా రాకపోయేసరికి కూతుళ్ళు, భార్య కంగారు పడసాగారు. బాధ్యత తల బరువుకు కృంగిపోతున్న కుటుంబరావు మనసెరిగిన భార్య, కృష్ణవేణిని తిట్టిపోసింది. తెలివయిన కృష్ణవేణి తను తొందరపడి నోరుజారిన మాటలకు నొచ్చుకుంది. తండ్రి తమనెంతగా ప్రేమిస్తాడో తెలుసు.

''పెళ్ళి చేసుకొని వెళ్ళిపోనులే నాన్నా..ఇంజనీరునయి నీ దగ్గరే ఉండి మిమ్మల్ని చూసుకొంటా




కొడుకులా'' అన్న మాటలు తండ్రి అసమర్ధత మీద, అహం మీదా దెబ్బతీసాయని అర్థం చేసుకొంది.

రాత్రి పదకొండు గంటలకి ఇల్లు చేరుకున్నాడు కుటుంబరావు- ఎలాగైనా కృష్ణవేణిని ఇంజనీర్‌ని చెయ్యాలని నిశ్చయించుకొని. అతడు రాగానే కాళ్ళకు చుట్టుకుపోయింది కృష్ణవేణి ''నన్ను క్షమించండి నాన్నా'' అంటూ.

''ఛ ఊరుకో. నీ ఇష్టప్రకారమే ఇంజనీరింగ్‌లో చేరుదువుగానిలే'' అన్నాడు.

''లేదు నాన్నా..నేను బి.యస్సీలోనే చేరతాను'' అంత స్థిరంగానూ చెప్పింది కృష్ణవేణి.

''వచ్చే జన్మలోనయినా నాలాంటి దరిద్రుని కడుపున పుట్టకు తల్లీ'' అనబోయిన తండ్రి నోటిని మూసేసింది కృష్ణవేణి.

★ ★ ★

కృష్ణవేణి బి.యస్సీలో చేరింది.

కూతురు ఇంజనీరింగ్ చదువును రిటర్న్సులేని ఇన్‌వెస్ట్‌మెంట్‌గాను, డెడ్ కేపిటల్‌గానూ భావించి, అదే కొడుకు మీదయితే వచ్చే కేపిటల్ గెయిన్స్‌ను ఊహించబోయిన కుటుంబరావు ఎప్పటికీ మధనపడుతూనే ఉన్నాడు.

ఇంజనీరింగ్ కాకపోయినా, ఎమ్మెస్సీ చేసి మంచి ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులను కొడుకులా చూసుకోవాలని, అవసరమనుకుంటే పెళ్ళి కూడా మానుకోవాలనుకుని నిర్ణయించుకొంది కృష్ణవేణి. 'ఆడ'పిల్ల 'ఈడ'నే ఉంటే సమాజం ఒప్పుకోదని ఆ లేత మనసుకేం తెలుసు?

పొన్నాడ సత్యప్రకాశరావు